సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



టన్ను చీనీ రూ.20 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టం రూ.4 వేలు, సరాసరిన రూ.13 వేల ప్రకారం ధర పలికాయి.



వసూళ్లకు 'అభినందన'

హిందూపురం ఎమ్మెల్యే, హీరో బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించిన నేపథ్యంలో హిందూపురంలో వచ్చే నెలలో అభినందన సభకు ఆయన పీఏలు ప్లాన్ చేశారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
40.8°/21.9°

జిల్లా పరిధిలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. భానుడి భగభగలతో వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

హౌసింగ్ లబ్ధిదారులకు అదనపు నిధులు



అధికారులతో సమీక్షిస్తున్న పీడీ వెంకటనారాయణ

లేపాక్షి: రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకం కింద గతంలో మంజూరై అర్ధాంతరంగా ఆగిపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు ఇళ్ల పూర్తి చేసుకునేలా ప్రభుత్వం అదనపు నిధులు మంజూరు చేస్తున్నట్లు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటనారాయణ తెలిపారు. గురువారం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే అనుకున్న స్థాయిలో ఇళ్లను పూర్తి చేసుకోలేకపోయారని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసిందన్నారు. ఇళ్లను జూన్ 12వ తేదీ లోగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే మండల వ్యాప్తంగా 830 ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తులు వచ్చాయని వాటిని కూడా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాసులు, ఏఈ రాజేంద్రప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

బత్తలపల్లి: పదో తరగతి ఫలితాల్లో 500 మార్కులు పైబడిన వచ్చిన విద్యార్థులు ఆర్డీటీ నిర్వహించే ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ కృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఆర్డీటీ పేద విద్యార్థులను ఇంటర్ చదివించేందుకు అవకాశం కల్పిస్తోందన్నారు. 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు ఆర్డీటీ సెట్‌కు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో ఆర్డీటీ స్పాన్సర్‌షిప్ కలిగి ఉంటే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివి ఉన్నా అర్హులన్నారు. ఓసీ, బీసీ, స్పాన్సర్‌షిప్ లేనివారు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చదివి ఉండాలన్నారు. శుక్రవారం నుంచి స్థానిక ఫీల్డ్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. 30వ తేదీ వరకూ దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. మే 11న ఆర్డీటీ సెట్ పరీక్ష ఉంటుందన్నారు. ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకునేవారు ఆధార్, రేషన్ కార్డు, పదో తరగతి హాల్ టికెట్, మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫోటోలు తీసుకురావాలన్నారు.

స్వచ్ఛతలో జిల్లాకు అవార్డు



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: స్వచ్ఛాంధ్ర గ్రామీణ్ కార్యక్రమం అమలులో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు జిల్లాకు ప్రత్యేక అవార్డును అందజేశారు. గురువారం విజయవాడలో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చేతులు మీదుగా కలెక్టర్ టీఎస్ చేతన్ అవార్డును అందుకున్నారు.

ఇంటర్‌లో నూతన సిలబస్‌పై శిక్షణ



ఇంటర్‌లో నూతన సిలబస్‌పై శిక్షణ బ్యానర్ ప్రదర్శిస్తున్న రఘునాథరెడ్డి

పుట్టపర్తి: ఈ ఏడాది ప్రభుత్వం ఇంటర్‌లో నూతన సిలబస్ ప్రవేశ పెట్టిందని, ఆ సిలబస్‌పై ఆయా కళాశాల అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నట్లు ఇంటర్ జిల్లా విద్యాశాఖ అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. ఆయన సిబ్బందితో కలిసి కొత్తచెరువు కార్యాలయం ఆవరణలో బ్యానర్ ప్రదర్శించారు. నూతన సిలబస్‌పై అధ్యాపకులకు నాలుగు దశలలో శిక్షణ ఉంటుందన్నారు. మే 5వ తేదీ వరకూ పెనుకొండ కళాశాలలో సబ్జెక్టుల వారీగా శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు.

బాధితుల పక్షాన నిలబడాల్సిన కొందరు ఖాకీలు సెటిల్‌మెంట్‌లే ధ్యేయంగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యేలు ఏది చెబితే అది ఎఫ్ఐఆర్‌లో చేరుస్తున్నారు. బాధితులతో పద్ధతిగా మాట్లాడకుండా బూతులు లంఘించుకుంటున్నారు. డబ్బు ఎవరు ఎక్కువ ఇస్తారో వారికే న్యాయం చేస్తున్నారు.

- టీడీపీ నేతల అండతో కొందరు ఖాకీల విచ్చలవిడితనం
- ఎమ్మెల్యేలే బాసులుగా విధులు నిర్వర్తిస్తున్న సీఐలు
- రాత్రి పదిన్నర తర్వాతే కదిరి అర్బన్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు
- ఇటుకలపల్లి సీఐ దగ్గరికెళితే కేసులతో పాటు బూతులు బోనస్
- రాయదుర్గం సీఐ జయ.. ఆయనకు లేనిదే దయ అనే విమర్శలు
- పుట్టపర్తి ఎస్పీ ఆఫీసులో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ప్రదీప్ హవా



అంతా మా ఇష్టం..

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొంతమంది సీఐల వ్యవహార శైలితో ఖాకీ చొక్కాకు అవినీతి మరకలంటుకున్నాయనే విమర్శలున్నాయి. కదిరి అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐగా ఉన్న నారాయణరెడ్డిపై తీవ్ర అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గంజాయి కేసులో పట్టుబడిన వారిని ఉదారంగా వదిలేసి కేవలం బైండోవర్‌తో సరిపెట్టారనే విమర్శలున్నాయి. రాత్రి పదిన్నర వరకూ ఎఫ్ఐఆర్‌లు నమోదు కావని, సెటిల్‌మెంట్ సక్సెస్ అయితే ఎఫ్ఐఆర్ ఊసే ఉండదని, కుదరకపోతే కేసు నమోదవుతుందని బాధితులు చెబుతున్నారు. సీఐ కార్యాలయం ఎప్పుడూ సివిల్ పంచాయితీలతో బిజీగా ఉంటోందని తెలిసింది.

'జయ'.. కానరాని దయ

రాయదుర్గం అర్బన్ సీఐ జయానాయక్‌కు దయ అనేది ఎక్కడా లేదన్న విమర్శలున్నాయి. ఈ స్టేషన్‌లో రోజూ సివిల్ పంచాయితీలు ఎక్కువగా జరుగుతున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఓ వివాదంలో బాధితుడి నుంచి భారీగా డబ్బు చేతులు మారినట్టు బాధితుల తరపు బంధువులు చెప్పారు. స్టేషన్‌కు వచ్చే వారిపట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధికి మాత్రమే సేవకుడిగా ఉంటున్నారనే విమర్శలున్నాయి.

హేమంత్ నోట బూతులే..

ఇటుకలపల్లి సీఐగా ఉన్న హేమంత్‌కుమార్ నోటికొచ్చినట్టు బూతులు తిడుతున్నట్టు బాధితులు వాపోతున్నారు. పరిటాల శ్రీరామ్‌కు అనుంగు అనుచరుడిగా ఉన్న ఈయన టీడీపీ నేతల అండచూసుకుని రెచ్చిపోతున్నట్టు ఇటీవల ఓ బాధితుడు చెప్పారు. మొన్నటికి మొన్న అక్రమంగా మట్టి తోలుతున్న రెండు టిప్పర్‌లు పట్టుకుని తెల్లారేసరికి వదిలేశారు. వారితో సెటిల్‌మెంట్ చేసుకున్నట్టు తేలింది. టీడీపీ నేతలు చెబితే ప్రత్యర్థులను అకారణంగా స్టేషన్‌కు పిలిపించడం, బెదిరించడం చేస్తున్నట్టు చెబుతున్నారు. స్టేషన్‌కు వెళ్లిన వారికి కనీస మర్యాద ఇవ్వకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ కార్యకర్తగా ఎస్ఐ సుధాకర్

జిల్లాలోనే కాదు రాష్ట్రంలోనే ఖాకీ డ్రెస్సు వేసుకుని పొలిటికల్ పార్టీకి కొమ్ముకాస్తున్న పోలీసుగా రామగిరి ఎస్ఐ సుధాకర్ గుర్తింపు పొందారు. పరిటాల కుటుంబానికి పనిమనిషిగా ఉన్నట్టు కూడా ఆరోపణలున్నాయి. ఇటీవల రామగిరి వైస్ ఎంపీపీ ఎంపికలో ఎంపీటీసీలను బెదిరించడం, వారిని టీడీపీ వ్యానులో ఎక్కించడం వంటివి బహిరంగంగా చేశారు. బాధితులను భయభ్రాంతులకు గురిచేశారు. పక్కా టీడీపీ కార్యకర్తలా సామాజిక మాధ్యమాల్లో మాట్లాడినా ఇతనిపై శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న వీసమెత్తు చర్యలు తీసుకోలేదు.

ఎస్‌బీ ఎస్ఐ ప్రదీప్ కీలకంగా..

శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఆఫీసులో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐగా పనిచేస్తున్న ప్రదీప్.. ప్రస్తుతం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు. తనపై అధికారులకు పనులు చక్కబెట్టడంలో దిట్ట అని పేరుంది. చాలా మంది సీఐలు, డీఎస్పీలకు జరగని పనులు ప్రదీప్‌కు జరుగుతాయి. సెటిల్‌మెంట్ల ద్వారా పై అధికారులకు ఆర్థిక చేయూతనివ్వడం, ఎప్పటికప్పుడు ఏ పోలీసు అధికారి ఏం చేస్తున్నారో పెద్దబాస్‌కు చెప్పడం ఇతని పని. దీంతో పోలీసు అధికారులు చాలామంది ప్రదీప్ అంటే భయపడిపోతున్నారు. జిల్లాలో ప్రదీప్ ఏదిచెబితే అది జరుగుతుందని చెబుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

నేడు పాసింగ్ ఔట్ పరేడ్

గోరంట్ల: పాలసముద్రం సమీపంలోని సెంట్రల్ ఎక్సైజ్ అకాడమి అండ్ నార్కోటిక్స్ (నాసిన్) సంస్థలో శిక్షణ పొందుతున్న ఐఆర్ఎస్ 75వ బ్యాచ్ పాసింగ్ ఔట్ పరేడ్ శుక్రవారం జరగనుంది. ఉదయం 8 గంటలకు ప్రారంభంకానున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి హాజరుకానున్నారు. గురువారం రాత్రే ఆయన జిల్లాకు చేరుకున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ఖైదీలకు వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న జడ్జి శివప్రసాద్

కదిరి టౌన్: ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలని అనంతపురం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్ ఆదేశించారు. గురువారం కదిరి సబ్ జైలును తనిఖీ చేశారు. అనంతరం జైలు సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు. ఖైదీలకు వండిన భోజనాన్ని పరిశీలించారు. మంచి ప్రవర్తన కలిగి ఉండాలని, మార్పు చెందాలని ఖైదీలకు సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

30న పాలిసెట్

అనంతపురం: డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లు నిర్వహించడానికి నిర్వహిస్తున్న ఏపీ పాలిసెట్-2025ను ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సి.జయచంద్రా రెడ్డి తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లనుwww.poycetap.nic.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పాపిరెడ్డిపల్లిలో భయం.. భయం

- పోలీసు పికెట్ తీసేసిన యంత్రాంగం
- మళ్లీ రెచ్చిపోయే ఆలోచనలో టీడీపీ రౌడీమూకలు
- లింగమయ్య హత్య జరిగి నెల పూర్తికాకనే కుట్రలు



పాపిరెడ్డిపల్లి గ్రామంలో పోలీసు పికెట్ ఖాళీ చేసిన దృశ్యం

సాక్షి, పుట్టపర్తి/రామగిరి: మాజీ మంత్రి, ఎమ్మెల్యే పరిటాల సునీత ఇలాకాలో వైఎస్సార్‌సీపీ నేత హత్య జరిగి నెల రోజులు కూడా కాలేదు. ఇంతలోనే పరిటాల సునీత మరో కుట్ర పన్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నట్లు తెలుస్తోంది. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఉగాది పర్వదినం రోజున కురుబ లింగమయ్యను టీడీపీ గూండాలు దారుణంగా హత్య చేశారు. నెల రోజులు తిరగకుండానే పోలీస్ పికెట్ తీసేయడంపై గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోననే భయంతో బతుకుతున్నారు. పోలీసులు అందుబాటులో లేరని తెలిస్తే.. గ్రామంలోని టీడీపీ అల్లరిమూకలు రెచ్చిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పోలీసు పికెట్ ఏర్పాటు చేసి గ్రామానికి రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

భద్రతా వైఫల్యం.. మరోసారి బహిర్గతం

గత మార్చిలో పాపిరెడ్డిపల్లిలో నాలుగు రోజుల పాటు గొడవ కొనసాగింది. పోలీసులకు విషయం తెలియజేసినా పట్టించుకోలేదు. దీంతో గొడవ పెద్దదై లింగమయ్యను హతమార్చే వరకూ వచ్చింది. అలాగే రామగిరి ఎంపీపీ ఎన్నికల విషయంలో పోలీసుల భద్రతా వైఫల్యం బట్టబయలైన సంగతి తెలిసిందే. పోలీసుల సమక్షంలోనే ఓ ఎంపీటీసీ సభ్యురాలిని టీడీపీ వాళ్లు కిడ్నాప్ చేశారు. అంతకుముందు రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ గూండాలు తెగబడ్డారు. పాపిరెడ్డిపల్లిలో హత్య జరిగి నెల రోజులు కూడా పోలీసు బందోబస్తు నిర్వహించలేదంటే.. మరో కుట్రకు తెరలేపారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మాజీ సీఎం వైఎస్ జగన్ పాపిరెడ్డిపల్లికి పర్యటన సమయంలో హెలిప్యాడ్ వద్ద సమస్య వచ్చిన సంగతి తెలిసిందే.

ఎస్ఐ సుధాకర్‌యాదవ్ ఏం చేస్తున్నారో?

రామగిరి ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న సుధాకర్‌యాదవ్.. అక్కడ విధుల్లో చేరిన నాటి నుంచి ఎమ్మెల్యే పరిటాల సునీత కనుసన్నల్లోనే ఉన్నారన్న విమర్శలున్నాయి. అయినా పోలీసు ఉన్నతాధికారులు ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ కేసులు బనాయింపునకు కూడా ఆయన వెనుకాడటం లేదు. పోలీసు పికెట్ రద్దు చేయడంపై సుధాకర్‌యాదవ్ హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కృషి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం చేయడానికి కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం జిల్లా పంచాయతీశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ హాజరై జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళిలర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సిద్ధించాలంటే గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ తరుపున పన్నులు, ఇతర వసూళ్లు 80 శాతం చేసినందుకు, ఓడీఎఫ్ 100 శాతం, పంచాయతీ పోర్టల్‌లో పాలనాపరమైన విషయాలు, ఇతర వివరాలు 100 శాతం నమోదు చేసినందుకు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో పురోగతి సాధించడంతో జిల్లాకు ఉత్తమ అవార్డు వచ్చిందన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులకు జాయింట్ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు డివిజనల్ పంచాయతీ అధికారులు, ఉప మండలాభివృద్ధి అధికారులు, 18 మంది పంచాయతీ కార్యదర్శులు, జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయం ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ధర్మవరం డివిజనల్ పంచాయతీ అధికారి శివకుమారి, కదిరి డీఎల్‌డీఓ అంజనప్ప, బుక్కపట్నం ఉప మండలాభివృద్ధి అధికారి అశోక్‌కుమార్‌రెడ్డి, బత్తలపల్లి కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు రీ టెండర్లు

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని మడకశిర ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గజిట్ నంబర్ 80, 81, 84, 87 ఉన్న మద్యం దుకాణాలకు రీటెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి గోవిందనాయక్ ఒక ప్రకటన తెలిపారు. గతంలో షాపులకు టెండర్లు పిలిచి లాటరీ ద్వారా ఎంపిక చేశామన్నారు. వారు షాపులు నిర్వహించలేక వదిలేశారని పేర్కొన్నారు. రెండోసారి రీ టెండర్లకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు ఈనెల 25 నుంచి మే 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు 2 లక్షల రూపాయలు దరఖాస్తు రుసుము చెల్లించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో జిల్లాలోని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మే 5వ తేదీ లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయిస్తామన్నారు.

శభాష్ ఉమామహేశ్వరరెడ్డి

- సివిల్స్‌లో 221 ర్యాంకు



తల్లిదండ్రులతో ఉమామహేశ్వరరెడ్డి

కదిరి అర్బన్: తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రణాళిక బద్ధంగా చదివి సివిల్స్‌లో 221 ర్యాంకు సాధించాడు కదిరికి చెందిన బొల్లంపల్లి ఉమామహేశ్వరరెడ్డి. ఆయన కర్నూలు మాంటిస్సోరిలో పదో తరగతి చదివారు. హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో బీటెక్ పూర్తి చేశారు. ఉమామహేశ్వరరెడ్డి తల్లిదండ్రులు రాజశేఖర్‌రెడ్డి, తల్లి పద్మావతి విశ్రాంత ఉపాధ్యాయులు. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో ఢిల్లీలో శిక్షణ పొందారు. హైదరాబాద్‌లో ఉంటూ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. గతంలోనే సివిల్స్‌లో 270 ర్యాంకు సాధించి ఐఆర్ఎస్ సాధించారు. ప్రస్తుతం నాగపూర్‌లో ఐఆర్ఎస్ శిక్షణలో ఉన్నారు. ఇంకా మెరుగైన ర్యాంకు సాధించాలని ప్రణాళికాబద్ధంగా చదివి మొన్న వచ్చిన సివిల్స్ ఫలితాల్లో 221వ ర్యాంకు సాధించారు.

నువ్వే మాకు శరణం సాయీ..

- ప్రశాంతి నిలయంలో ఘనంగా సత్యసాయి ఆరాధన మహోత్సవం
- శతజయంతి వేడుకలను విజయవంతం చేయాలని రత్నాకర్‌రాజు పిలుపు



సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథాలను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న భజన బృందం

ప్రశాంతి నిలయం: అశేష భక్తకోటి తమ ఇలవేల్పు సత్యసాయికి ఆత్మనివేదనను అర్పించుకున్నారు. నువ్వే మాకు శరణం అంటూ భక్తిగీతాలతో సాయిరాముడిని స్మరించారు. సత్యసాయి ఆరాధన మహోత్సవం గురువారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు సత్యసాయి మహాసమాధి చెంత సాయి విద్యార్థుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సత్యసాయి విద్యార్థులు, మిర్‌పురి సంగీత కళాశాల భజన బృందం సత్యసాయిని కీర్తిస్తూ పంచరత్న కీర్తనలు ఆలపించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు నాగానంద ప్రారంభోపన్యాసం చేశారు. విశ్వమానవాళిని అంధకారం నుంచి చైతన్యం వైపు నడిపిన ఆదిగురువు సత్యసాయి అని కొనియాడారు. అనంతరం ''సత్యసాయి ప్రేమ ప్రవాహిని'' యాత్ర పేరుతో ఏర్పాటు చేసిన ప్రచార రథాలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి, నాగానంద, సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే తదితరులు ప్రారంభించారు. తర్వాత బ్రోచర్‌లను విడుదల చేశారు. నమిష్ పాండే మాట్లాడుతూ ప్రేమ వాహిని యాత్రను దేశ వ్యాప్తంగా ఉన్న సత్యసాయి భక్తులు విజయవంతం చేయాలన్నారు. 2026 నవంబర్ 24 వరకూ దేశ వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తాయన్నారు. సాయంత్రం ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఉత్తర ఉన్ని కృష్ణ బృందం నిర్వహించిన సంగీత కచేరీ అందరినీ అలరించింది. వేడుకల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు చక్రవర్తి, శెట్టి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిల్‌వ్యూ స్టేడియంలో మహా నారాయణ సేవ

సత్యసాయి ఆరాధన మహోత్సవంలో భాగంగా గురువారం ప్రశాంతి నిలయంలో వేడుకలు ముగిసిన అనంతరం పట్టణంలోని హిల్‌వ్యూ స్టేడియంలో మహానారాయణ సేవ నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యులతో కలసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 30 వేల మందికి సత్యసాయి అన్నప్రసాదాలతో పాటు చీర,దోవతీ వితరణ చేశారు.

శతజయంతి వేడుకలకు ఏర్పాట్లు

సత్యసాయి శతజయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండే ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు తెలిపారు. సత్యసాయి ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి ప్రేమ ప్రవాహిని పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. దేశంలోని సుమారు 500 జిల్లాల్లో 2.5 లక్షల కిలోమీటర్లు ప్రేమ ప్రవాహిని రథాలు ప్రచారం చేస్తాయన్నారు. సత్యసాయి అవతార వైభవం, సేవా మార్గాలు, ఆధ్యాత్మిక తత్వాన్ని ప్రజలకు వివరిస్తూ చైతన్య పరుస్తాయన్నారు.



నారాయణ సేవలో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహా సమాధి

క్లుప్తంగా

ఒకే ఈతలో నాలుగు మేక పిల్లలు!



గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామానికి చెందిన సిద్దయ్యగారి మల్లికార్జున పెంచుతున్న మేక ఒకే ఈతలో నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. అంతకు ముందుకు కూడా ఇదే మేక మూడు పిల్లలకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. పుట్టిన నాలుగు పిల్లలు క్షేమంగా ఉండడంతో గ్రామస్తులు ఆసక్తిగా గమనించారు. అధిక హార్మోన్ల ప్రభావంతో అండాలు అధికంగా ఉత్పత్తి అయినప్పుడు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయని పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ధర్మవరం అర్బన్: స్థానిక ప్రభుత్వాస్పత్రి పక్కన ఉన్న అన్న క్యాంటీన్ ఎదుట గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య వయస్సు ఉండవచ్చునని అంచనా వేశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. వ్యక్తి మిస్సింగ్ కేసుల్లో సంబంధీకులు ఎవరైనా ఉంటే ధర్మవరం వన్ టౌన్ సీఐ (94407 96831), ఎస్ఐ (94948 16259), హెడ్ కానిస్టేబుల్ (98496 48216)ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

వ్యక్తి దుర్మరణం

కదిరి టౌన్: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లిలో నివాసముంటున్న దేరంగుల లక్ష్మీనారాయణ (40)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం రాత్రి పనిముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరిన లక్ష్మీనారాయణ... మున్సిపల్ పరిధిలోని టిడ్కో ఇళ్ల వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక గోరంట్ల వైపుగా వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వసూళ్ల అభినందన!



ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ దక్కడంతో సత్కరించాలని పీఏల నిర్ణయం

- 'పురం'లో సభ నిర్వహణకు ఏర్పాట్లు
- జన సమీకరణ, ఖర్చు పేరుతో భారీగా వసూళ్లు
- జేబులు నింపుకునేందుకు సిద్ధమైన పీఏలు!

ఖర్చు తక్కువ.. వసూళ్లు ఎక్కువ

బాలకృష్ణ అభినందన సభ కోసం 20 వేల మందిని జన సమీకరణ చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే దృష్టిలో అంతమంది జనాభా వస్తున్నారని చెప్తే ఖర్చులు కూడా భారీగా ఉంటాయని ఆయన దృష్టిని మరల్చే యత్నం చేస్తున్నారని తెలిసింది. ఎంజీఎం గ్రౌండ్ కెపాసిటీ 6 నుంచి 7 వేల మందికి మించదని... మరి ఎలా 20 వేల మంది సభకు ఎలా తరలిస్తారన్న విషయంలో ఆ పార్టీ సభ్యుల మధ్యే చర్చ సాగుతోంది. 20 వేల మందితో సభ అంటూ ఖర్చు భారీగా ఉంటుందని జేబులు నింపుకునేందుకు ఎత్తువేశారని అంటున్నారు.

సాక్షి టాస్క్ ఫోర్స్: హిందూపురం ఎమ్మెల్యే, హీరో బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించిన నేపథ్యంలో హిందూపురంలో వచ్చే నెలలో అభినందన సభకు ఆయన పీఏలు ప్లాన్ చేశారు. ఇందుకోసం పట్టణంలోని ఎంజీఎం గ్రౌండ్‌ను ఎంపిక చేశారు. సుమారు 20 వేల మందితో సభను నిర్వహించాలని ప్రణాళిక చేసుకుంటున్నారు. ఇదే అదునుగా అందిని కాడికి దోచేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

భారీగా వసూళ్లకు ప్లాన్?

బాలకృష్ణ అభినందన సభ కోసం అయ్యే ఖర్చుకు మించి భారీగా నగదు కూడబెట్టుకోవాలన్న ఆలోచనలో ఎమ్మెల్యే పీఏలు ఉన్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఇందులో భాగంగానే పక్కా ప్లాన్ ప్రకారం అన్ని అడ్డదారుల్లోనూ డబ్బు వెనుకేసుకునేలా పథకం రచించారంటున్నారు. జన సమీకరణ బాధ్యత టీడీపీ నేతలకే అప్పజెప్పుతున్నారు.

టీడీపీ నేతలకు ఆఫర్లు

ఊరకనే ఖర్చు అంటే టీడీపీ నేతలు వెనుకడుగు వేస్తారేమో అన్న ఆలోచనతో పదవులు, కాంట్రాక్టులు ఆశ చూపెడుతున్నారు. భూఆక్రమణలకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. ఇసుక, మట్టి దందాలకు అడ్డు లేకుండా చేస్తున్నారని సమాచారం. వేలంలో అమ్మినట్లు పదవులను అమ్మకానికి పెట్టారంటున్నారు. ఇందులో భాగంగానే మార్కెట్ యార్డు చైర్మెన్ పదవి టీడీపీ నేతకు ఇచ్చారన్న విమర్శలున్నాయి. మద్యం బెల్టు షాపులు నిర్వహించేందుకు కూడా సహకరిస్తున్నారని చెబుతున్నారు.

ఆ నలుగురిపై భారం

హిందూపురం పట్టణానికి చెందిన నలుగురు టీడీపీ ముఖ్య నేతలపై వసూళ్ల భారం వేశారని సమాచారం. వారు కూడా భారీ మొత్తంలో పీఏలకు నగదు అందించినట్లు తెలుస్తోంది.

మండల పరిషత్ నిధులకు ఎసరు!

నియోజకవర్గంలోని మండల పరిషత్ నిధులను ఎమ్మెల్యే పీఏలు భారీగా వాడుకున్నట్లుగా తెలుస్తోంది. చేయని పనులకు లక్షల రూపాయలు ఒక్కో మండలం నుంచి డ్రా చేసినట్లు తెలిసింది. ఈ నగదు అంతా ఎమ్మెల్యే పీఏల ఖాతాలకు అక్రమంగా మళ్లించారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. పంచాయతీరాజ్ పనుల్లో కూడా చేసిన పనులకే లక్షలాది రూపాయలు బిల్లులు మంజూరు చేయించుకొని సభకు మళ్లిస్తున్నట్లు సమాచారం. ఎంపీపీలు అందరూ వైఎస్సార్‌సీపీకి సంబంధించిన వారే అయినా అభివృద్ధి పనులంటూ వారితో నిధులకు ఆమోదం తీసుకోవడం, ఆ నిధులను మళ్లించడం వంటివి గుట్టుగా కానిచ్చేశారని చెబుతున్నారు.

కొట్నూరు వద్ద మున్సిపాలిటీ స్థలంలో అక్రమంగా షెడ్ల నిర్మాణానికి పీఏలు ఒకే చెప్పడంతో అందుకోసం రూ. 20 లక్షలు సదరు టీడీపీ నేత ఎమ్మెల్యే కార్యాలయానికి చెల్లించినట్లు సమాచారం. అందుకే మున్సిపల్ అధికారులు ఎవరూ అటువైపు వెళ్లడం లేదు. పరిశ్రమల నుంచి వచ్చే నెలవారీ మొత్తం, మద్యం దుకాణాలు, కల్లు దుకాణాల నుంచి మామూళ్లు, మట్టి, ఇసుక ఇలా ఒకటి కాదు రెండు కాదు అన్నింట్లో సభ కోసం అంటూ అందినకాడికి దోచేయాలని పీఏలు ప్లాన్ చేసినట్లు తెలిసింది.

వసూళ్ల సొమ్మంతా చిలకలూరిపేటకేనా?

బాలకృష్ణ ఇలాకాలో పీఏల వసూళ్లు తారస్థాయికి చేరాయి. ముగ్గురు పీఏల్లో ఒకరు వసూళ్ల సొమ్మంతా చిలకలూరిపేటకు చేరుస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందు కోసం నియోజకవర్గంలో ఇష్టారాజ్యంగా అవినీతికి శ్రీకారం చుట్టారని అంటున్నారు. సహజ వనరులు, ప్రజల సొమ్మును స్థానిక సమస్యలకు వాడకకుండా పీఏలు సొంత జేబులు నింపుకోవడానికే వాడుతున్నారన్న విమర్శలున్నాయి.

నూతన జిల్లాల ప్రాతిపదికన కౌన్సెలింగ్ నిర్వహించాలి



డీఎంహెచ్ఓకు వినతి పత్రం ఇస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

పుట్టపర్తి అర్బన్: నూతన జిల్లాల ప్రాతిపదిక మేరకే తమకు రివైజ్డ్ రీడిప్లాయ్‌మెంట్ నిర్వహించాలని హెల్త్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగంను గురువారం కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న రివైజ్డ్ రీడిప్లాయ్‌మెంట్ కౌన్సెలింగ్‌ను స్థానిక జిల్లాలోనే నిర్వహించాలని కోరారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహిస్తే తమకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను మలేరియ సబ్ యూనిట్లు సైతం వర్తింపజేస్తూ జిల్లా మెరిట్ లిస్ట్‌ను ప్రదర్శించాలని కోరారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల మేరకు కౌన్సిలింగ్ చేపడతామని హామీనిచ్చారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



వాణి మృతదేహం

బుక్కరాయసముద్రం: మార్కులు సరిగా రాలేదంటూ తండ్రి మందలింపుతో మనస్తాపం చెంది డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... బీకేఎస్ మండలం పొడరాళ్ల గ్రామానికి చెందిన రవి కుమార్తె వాణి (20) అనంతపురంలోని కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఆన్‌లైన్ ద్వారా బ్యాంక్ కోచింగ్ తీసుకుంటున్న ఆమె కోచింగ్‌కు నిర్వహించిన పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయి. విషయం తెలుసుకున్న తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శేషవాహనంపై విహరించిన శ్రీవారు



బొమ్మనహాళ్: మండల కేంద్రంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి బ్రహోత్సవాల సందర్భంగా గురువారం శ్రీవారు శేష వాహనం ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వైదపండితుల ఆధ్వర్యంలో పవిత్ర గంగాజలాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ , అలంకరణ , మంగళహారతి, తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. రాత్రి 8 గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంలో స్వామి వారిని గ్రామ వీధుల్లో ఊరేగింపు చేశారు. వందలాదిగా భక్తులు పాల్గొని శ్రీవారికి మొక్కులు తీర్చుకున్నారు.

15 మంది చిన్నారులకు బీఎంటీ చికిత్స



తలసేమియా బాధిత చిన్నారులతో వైద్యులు, సంకల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు

అనంతపురం మెడికల్: ఉమ్మడి జిల్లాలోని 15 మంది తలసీమియా బాధిత చిన్నారులకు బెంగళూరులోని సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయనున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌పై తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులకు గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తలసీమియా బాధిత చిన్నారులకు అందించి సదుపాయాలను సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధి ఆంకాలజిస్టు డాక్టర్ మోహన్ రెడ్డి, అభిజిత్, పుష్ప వివరించారు. డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... తలసీమియాతో బాధపడే చిన్నారులకు ప్రీవెంటివ్, చికిత్సనందించేందుకు సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ సహాయం చేస్తోందన్నారు. సర్వజనాస్పత్రిలో గైనిక్ విభాగంలో తలసీమియా జన్యు లోపాన్ని గుర్తించడానికి ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 వారాలున్న 1,500 మంది గర్భిణుల్లో తలసీమియా జన్యులోపాన్ని గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 40 మందిలో జన్యులోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిలో 8 మంది ఫుల్ మ్యాచింగ్, మరో ఏడుగురు హాఫ్ మ్యాచింగ్ అయ్యారన్నారు. అంకాలజిస్టు డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... కేంద్రం సహకారంతో చిన్నారులకు బెంగళూరులోని జైన్ ఆస్పత్రిలో చికిత్సనందిస్తారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ శంకర్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చూపిన పోలీసులు



అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు



108 వాహనంలో ఆర్డీటీ ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: స్థానిక పోలీసులు మానవత్వంతో ఓ వృద్ధుడిని సకాలంలో ఆస్పత్రికి చేర్పించి, ప్రాణాలు కాపాడారు. వివరాలు.. బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామ శివారులోని నార్పలకు వెళ్లే మార్గంలో ఓ చెట్టు కింద గుర్తు తెలియని వృద్ధుడిని వదిలి వెళ్లారనే సమాచారాన్ని అందుకున్న బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ వెంటనే స్పందించారు. కానిస్టేబుల్ అనిల్ కుమార్, హోంగార్డు నరసింహులును అక్కడకు పంపి, ఆరా తీయించారు. చెట్టు కింద నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడిని 108 వాహనంలో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న ప్రజలు పోలీసుల చొరవను అభినందించారు.

ఎస్కేయూ పరీక్షల షెడ్యూల్ మార్పు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ఈనెల 29, 30 తేదీల్లో జరగాల్సిన యూజీ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే నెల 2, 3 తేదీల్లో జరుగుతాయని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. పాలిసెట్ నేపథ్యంలో డిగ్రీ పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు తెలిపారు. ధర్మవరంలో ఒకరు, పామిడిలో ముగ్గురు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడినట్లు వెల్లడించారు.

దేవపుత్ర సాహిత్యం చిరస్మరణీయం



చం.శాస్త్రిని సత్కరిస్తున్న అనంత సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్: జిల్లా సాహిత్యంలో చిలుకూరి దేవపుత్రది ప్రత్యేక స్థానం. ఆయన ఎన్నో రచనలు చిరస్మరణీయంగా నిలిచిపోయాయని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం స్థానిక విశాలాంధ్ర బుక్ హౌస్ ప్రాంగణంలో టీవీ రెడ్డి అధ్యక్షతన చిలుకూరి దేవపుత్ర 73వ జయంతిని అనంత సాహితీ సంస్థలు, తెలుగు వెలుగు సామాజిక సంస్థ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రచయితలు, కవులు మాట్లాడుతూ.. జిల్లా సాహిత్యంలో చిలుకూరు దేవపుత్ర సామాన్యుల పక్షం వహించి ఎన్నో మానవీయ రచనలు చేశారని గుర్తు చేసుకున్నారు. అనంత సాహిత్యంలో చేసిన ప్రయోగాలు విలక్షణమైనవని తెలిపారు. దేవపుత్ర ఆశయాలను కొనసాగిస్తుండటంపై వారి కుటుంబ సభ్యులను అభినందించారు. కవి, గాయకుడు అంకె రామలింగమయ్య ఆలపించిన పద్యం ఆకట్టుకుంది. అనంతరం సీనియర్ కవి చం.శాస్త్రిని దేవపుత్ర స్మారకంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, ప్రసాద్, తిరుపాలు, హరీష్, రసూల్, వెంకటేష్, దేవపుత్ర కుటుంబీకులు చిలుకూరి దీవెన, అన్వేష్, కవులు, విశ్రాంత అధికారులు డాక్టర్ శశాంకమౌళి, మధురశ్రీ,, రియాజుద్దీన్, రామాంజనేయులు, గోవిందరాజులు, విశాలాంధ్ర బుక్ హౌస్ విశ్రాంత మేనేజర్ చెట్ల ఈరన్న పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి



మృతుడు కరేగౌడ

గార్లదిన్నె/బ్రహ్మసముద్రం: కనిపించకుండా పోయిన బ్రహ్మసముద్రం మండలం కోనాపురం గ్రామానికి చెందిన దండు కరేగౌడ (44) గురువారం ఉదయం గార్లదిన్నె వద్ద మృతదేహమై కనిపించాడు. పోలీసులు తెలిపిన మేరకు... కొంత కాలంగా మానసికంగా ఇబ్బంది పడే కరేగౌడ ఈ నెల 19న గార్లదిన్నెలో నివాసముంటున్న చెల్లెలు ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు సాయంత్రం అలా బయటకు వెళ్లి వస్తానంటూ చెల్లెలుకు తెలిపి ఇల్లు విడిచిన వెళ్లిన ఆయన రాత్రయినా రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. చివరకు బంధువులు ఊర్లలోనూ ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం మధ్యాహ్నం గార్లదిన్నెలోని అక్షర ఇంటర్నేషనల్ పాఠశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. వడదెబ్బతో మృతి చెందినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోలీసులు వైరల్ చేయడంతో గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే అప్రమత్తమై మృతదేహాన్ని పరిశీలించి, మృతుడిని కరేగౌడగా నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గార్లదిన్నె పీఎస్ ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

యువకుడి బలవన్మరణం



సిద్ధు నాయక్ (ఫైల్)

రాప్తాడు రూరల్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంటకు చెందిన రామచంద్ర నాయక్ కుమారుడు సిద్ధునాయక్ (19) 5వ తరగతి వరకు చదువుకున్నాడు. కేటరింగ్ కార్మికుడిగా పని చేసుకుంటూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న సిద్ధు నాయక్ గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఇంటికి చేరుకున్న అవ్వ.. విగతజీవిగా ఉరికి వేలాడుతున్న సిద్ధునాయక్‌ను చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని యువకుడి మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం అందుకున్న అనంతపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మెడికో ఆత్మహత్యాయత్నం

- పెంచికలపాడు విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఘటన


కోడుమూరు రూరల్: గూడూరు మండలం పెంచికలపాడు విశ్వభారతి మెడికల్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని కళాశాలపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు.. అనంతపురం జిల్లా ఆత్మకూరుకు చెందిన శ్రీనివాసులు, అనిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం కాగా, పెద్ద కుమార్తె హన్సిక.. విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల నిర్వహించిన పరీక్ష సరిగా రాయలేకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె గురువారం సాయంత్రం కళాశాల రెండో అంతస్తుపై నుంచి దూకింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను సహ విద్యార్థులు సిబ్బంది వెంటనే కళాశాలలోని హాస్పిటల్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై కె.నాగలాపురం పోలీసులు విచారణ చేపట్టారు.

ఐసీడీఎస్ పరిధిలోకి 'ప్రధానమంత్రి మాతృవందన యోజన'

అనంతపురం: ప్రధానమంత్రి మాతృవందన యోజన శిక్షణ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ నుంచి ఐసీడీఎస్ పరిధిలోకి తీసుకురానున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అనంతపురంలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సీడీపీఓలకు శిక్షణ ఇచ్చారు. రాష్ట్రస్థాయి అధికారులు, మెడికల్ డిపార్ట్‌మెంట్ కో–ఆర్డినేటర్లు ,నోడల్ ఆఫీసర్ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు హత్య కేసుల్లో వీడిన మిస్టరీ

- వివాహేతర సంబంధాలే కారణమని నిర్ధారించిన పోలీసులు
- హత్య కేసుల్లో నిందితుల అరెస్ట్



పుష్పావతి హత్యకేసులో నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: వివాహేతర సంబంధాల కారణంగానే తాడిపత్రి ప్రాంతంలో రెండు హత్యలు చోటు చేసుకున్నాయని పోలీసులు తెలిపారు. వేర్వేరు ఘటనలకు సంబంధించిన హత్య కేసుల్లో నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. తాడిపత్రి పట్టణ పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ సాయిప్రసాద్ వెల్లడించారు.

పుట్లూరు మండలం చప్పిడి వెంగన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డికి 15 సంవత్సరాల క్రితం తాడిపత్రి మండలం బందర్లపల్లికి చెందిన పుష్పావతితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేశ్వరరెడ్డి పెళ్లి కాకముందు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లిలో నివాసముంటున్న తన పిన్నమ్మ ఇంటికి తరచూ వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన అక్కిలి శ్రీలక్ష్మితో అయిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. అయితే శ్రీలక్ష్మికి పామిడి మండలం రామరాజుపల్లికి చెందిన రాజారెడ్డితో పెళ్లి జరిగింది. భర్త మరణించడంతో ఆమె పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో సులువుగా ఇద్దరి మధ్య అనుబంధం పెరిగింది. దీంతో తన భార్య పుష్పావతిని, కుమారులను వెంకటేశ్వరరెడ్డి నిర్లక్ష్యం చేస్తూ వచ్చాడు. అదే సమయంలో భర్త వివాహేతర సంబంధం విషయం తెలుసుకున్న ఆమె... ఆయనలో మార్పు రావాలని ఆకాంక్షిస్తూ ఆరు నెలలుగా పుట్టింట్లోనే ఉండిపోయింది. ఆ సమయంలో శ్రీలక్ష్మిని పిలుచుకుని నేరుగా తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డులో ఉన్న అద్దె ఇంట్లోకి వెంకటేశ్వరరెడ్డి మకాం మార్చాడు. ఆ తర్వాత కాపురానికి రావాలని పుష్పావతికి తెలపడంతో వెంకటేశ్వరరెడ్డి పేరు మీదున్న 9 ఎకరాల పొలాన్ని పిల్లల పేరుపై రాయాలని ఆమె పట్టుబట్టింది. ఈ అంశాన్ని వెంకటేశ్వరరెడ్డి, శ్రీలక్ష్మి వ్యతిరేకించారు. పుష్పావతి ఉంటే ఎప్పటికైనా తమకు ముప్పేనని భావించిన వారు.. పథకం ప్రకారం తాడిపత్రిలోని హేమాద్రి గెస్ట్‌హౌస్‌లో పెద్దల సమక్షంలో ఆస్తి పంపకాలపై పంచాయితీకి రావాలని కబురు పెట్టారు. దీంతో ఈ ఏడాది జనవరి 17న హేమాద్రి గెస్ట్‌హౌస్‌కు పుష్పావతి చేరుకుంది. పంచాయితీ పెద్దలతో మాట్లాడిన అనంతరం గది బయట వేచి ఉన్న పుష్పావతిపై అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న వేట కొడవలితో వెంకటేశ్వరరెడ్డి దాడి చేసి, హతమార్చి ఉడాయించాడు. అనంతరం శ్రీలక్ష్మిని పిలుచుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడి కోసం విస్తృత గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి శ్రీలక్ష్మి ఇంట్లో ఉన్న సామగ్రిని తీసుకెళ్లేందుకు యల్లనూరు రోడ్డులో ఉన్న అద్దె గదికి వారు చేరుకోగానే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించడంతో వెంకటేశ్వరరెడ్డి, శ్రీలక్ష్మిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

తాడిపత్రిలోని ఓశాంతి నగర్ నివాసముంటున్న మణికి పామిడి గ్రామానికి చెందిన యక్కలూరి మహేష్‌తో వివాహమైంది. ఈ క్రమంలో అత్తింటికి తరచూ వచ్చి వెళ్లే మహేష్... ఆ పక్కనే నివాసముంటున్న రమీజాబీతో ఏర్పడిన పరిచయంతో చాలా చనువుగా ఉండేవాడు. ఇది గమనించిన రమీజాబీ కుమారుడు సయ్యద్ ఫైరోజ్ తన పిన్నమ్మ షేక్ ఖాజాబీతో చెప్పుకుని బాధపడ్డాడు. దీంతో ఇంట్లో తరచూ గొడవలు చోటు చేసుకునేవి. ఈనెల 10న మహేష్ తన భార్య మణితో పాటు తాడిపత్రికి వచ్చాడు. 16వ తేదీ రమీజాబీతో షేక్ ఖాజాబీ, సయ్యద్ ఫైరోజ్ గొడవ పడుతుంటే వారికి సర్దిచెప్పేందుకు మహేష్ వెళ్లాడు. తమ ఇంటి గొడవలో నువ్వెందుకు కలుగ చేసుకుంటున్నావంటూ మహేష్‌పై ఖాజాబీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చి ఫైరోజ్‌కిచ్చి పొడవమని ప్రోత్సహించింది. దీంతో మహేష్ పొట్టలో బలంగా పొడవంతో తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఈ కేసులో సయ్యద్ ఫైరోజ్, షేక్ ఖాజాబీను వారి ఇంటి వద్దనే గురువారం పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.